కేంద్రం కనికరించలే!

సెంట్రల్ బడ్జెట్‌లో వరంగల్‌కు మొండిచేయి





బయ్యారంలోని ఇనుప ఖనిజం గుట్టలు

- నిర్మలమ్మ పద్దులో నిధుల కేటాయింపులు నిల్
- ఊసులేని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్, కొత్త లైన్లు
- బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ, సైనిక్ స్కూల్ విషయంలోనూ అదే తీరు
- గిరిజన విశ్వవిద్యాలయానికి పైసా విదల్చని కేంద్ర సర్కారు
- మేడారం జాతరకు జాతీయ హోదా ప్రకటన లేదు
- బడ్జెట్ తీరుపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న అసంతృప్తి



మూడో సారి కూడా కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టిన ఎన్డీఏ సర్కారు.. బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాపై ఏ మాత్రం కనికరం చూపలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఎన్నికవడంతో ఈ సారి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాల జల్లు కురుస్తుందని భావించారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు కూడా ఎన్నో కొన్ని కేటాయింపులుంటాయని ఆశపడ్డారు. ముఖ్యంగా కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే డివిజన్, కొత్త రైల్వేలైన్లు, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వరంగల్‌లో సైనిక్‌స్కూల్ ఏర్పాటు అంశాలు కచ్చితంగా ఉంటాయని ఆశించారు. కానీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఎనిమిది నెలల కాలానికి గాను మంగళవారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ తీరును చూసిన తర్వాత అందరూ నిరాశకు లోనయ్యారు. ఉమ్మడిజిల్లా వాసులు ఆశించిన వాటిలో ఏ ఒక్క అంశానికి సంబంధించి ఊసులేకపోవడం.. కేటాయింపులు లేకపోవడం.. ఏ పథకానికి కూడా నిధులు విడుదల చేయకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. నిర్మలమ్మ పద్దుతో తమకు ఒరిగిందేమీ లేదని, మళ్లీ మొండిచేయే చూపారని పెదవి విరుస్తున్నారు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

రౌడీషీటర్లు, నేరాలపై నిఘా పెట్టాలి : సీపీ

మట్టెవాడ, జూలై 23: రౌడీషీటర్లతోపాటు, వివిధ నేరాలపై ప్రతీక్షణం కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని, ఆర్థిక నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పోలీసులకు సూచించారు. మంగళవారం మట్టెవాడ పోలీస్ స్టేషన్‌ను సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. విధులు నిర్వహించే సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాలు, ఆయుధాల వినియోగం, సన్నిహిత సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు, తీవ్రమైన నేరాల సీడీ ఫైల్స్, స్థిరాస్తి చోరీలు, ఐటీ కేసుల ప్రస్తుత స్థితిగతులపై రికార్డులు తనిఖీ చేశారు. సుమారు రెండున్నర గంటలపాటు సీపీ తనిఖీ చేపట్టారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వివిధ కేసుల్లో అరెస్టయిన ఇతర రాష్ట్రాలకు చెందిన నిందితుల సమాచారాన్ని సంబంధిత రాష్ట్రాలకు ఎప్పటికప్పుడు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీసు స్టేషన్ పరిధిలో తిరిగే అనుమానితుల వివరాలు సేకరించి, పెట్రోలింగ్ విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే బాధితులకు సహకారం అందిస్తూ, వారితో మర్యాదపూర్వకంగా మెలగాలని స్పష్టం చేశారు. సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మట్టెవాడ పోలీసు సిబ్బంది పనితీరుపై సీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ ఆవరణలో సీపీ మొక్కలు నాటారు. తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, ఎస్‌ఐలు విఠల్, లచ్చయ్య పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ

విహార యాత్రలో విషాదం



- బొగత జలపాతం వద్ద నీటమునిగిన యువకుడు
- ప్రాణాలతో బయటపడ్డ మరో ఇద్దరు
- మృతుడు వరంగల్‌లోని కాశిబుగ్గ వాసి



వాజేడు, జూలై 23: ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం వద్ద మంగళవారం విషాదం చోటు చేసుకుంది. స్నేహితులతో కలిసి విహారయాత్రకు వచ్చిన యువకుడు నీట మునిగి మృతిచెందాడు. మరో ఇద్దరు యువకులు ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు, మృతుడి మిత్రులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని కాశీబుగ్గ ఏరియాలో సుందరయ్యనగర్‌కు చెందిన బొనగాని జశ్వంత్(19), అతడి మిత్రులు గౌస్, ధర్మతేజ, నాగేంద్ర, సుషాంత్, వంశీ, సాయికిరణ్ వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతాన్ని సందర్శించారు. జలపాతం ముందు ఫొటోలు దిగుతూ సరదాగా గడిపారు. ఈత కొలనులో దిగి స్నానాలు చేస్తుండగా జశ్వంత్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోతుండటంతో నాగేంద్ర కాపాడే ప్రయత్నం చేశాడు. దీంతో అతడు కూడా మునిగిపోయాడు. ఈ క్రమంలో ఈత వచ్చిన మరో మిత్రుడు ధర్మతేజ నాగేంద్రను ప్రాణాలతో బయటకు లాగాడు. జశ్వంత్ వద్దకు వెళ్తుండగా ధర్మతేజ సైతం నీటి ప్రవాహానికి కొట్టుకుపోసాగాడు. దీంతో గమనించిన బొగత రెస్క్యూటీం సభ్యుడు జితేంద్ర అతడిని కర్ర సాయంతో బయటకు తీసుకొచ్చాడు. రెస్క్యూ సిబ్బంది ఈతకొలనులో గాలించగా జశ్వంత్ మృతదేహం లభ్యమైంది. వెంకటాపురం (నూగూరు) సర్కిల్ సీఐ కుమార్, ఎస్సై తిరుపతిరావు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. జశ్వంత్ తండ్రి నగేష్‌కు పోలీసులు సమాచారం ఇవ్వగా కుటుంబ సభ్యులు ఏటూరునాగారం చేరుకున్నారు. నగేష్‌కు ఇద్దరు ఆడపిల్లలు ఉండగా ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాదం అలముకున్నాయి. జశ్వంత్ ఇటీవలే ఇంటర్ పూర్తి చేసి వరంగల్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో బీటెక్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు మిత్రులు తెలిపారు. నగేష్ ఆటో ట్రాలీ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొడుకు చేతికి వస్తున్నాడని అనుకొనే లోపే కానరాని లోకాలకు వెళ్ల డం తల్లిదండ్రులు భవాని, నగేష్‌కు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

వరంగల్ వాసులే అధికం

బొగత జలపాతం వద్ద తరచూ వరంగల్ వాసులు మృతిచెందడం ఆందోళన కలిగిస్తోంది. గత 12ఏళ్లలో 20మంది వరకు మృత్యువాతపడగా, వీరిలో వరంగల్‌కు చెందిన సుమారు 15 మందికి పైగా నీటమునిగి ప్రాణాలు కోల్పోయారని తెలుస్తోంది. వారిలో ఎక్కువ శాతం యువకులే. 2020లో ఓ యువకుడు ఓ యువకుడి మృతితో, కరోనా కాలంలో ఆంక్షలు విధించారు. మళ్లీ 2022 నుంచి సందర్శనకు పూర్తి స్థాయిలో అనుమతులు ఇవ్వగా తాజాగా మరో యువకుడు మృతిచెందాడు. రక్షణ చర్యలు లేకపోవడం, పర్యాటకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.



డాక్టర్ మురళి



డాక్టర్ రాంకుమార్‌రెడ్డి

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ మురళి

- కేఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాంకుమార్‌రెడ్డి

వరంగల్ మెడికల్, జూలై 23: ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా అనస్థీషియా విభాగం ప్రొఫెసర్ చిలక మురళికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. అలాగే కేఎంసీ ప్రిన్సిపాల్‌గా ఆర్థో విభాగం హెచ్‌వోడి ప్రొఫెసర్ కాటం రామ్‌కుమా ర్‌రెడ్డికి తా త్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఎంజీఎం ఆస్పత్రి ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ బదిలీపై ములుగు వైద్య కళాశాలకు ప్రొఫెసర్‌గా వెళ్లారు. దీంతో తాత్కాలికంగా ఎంజీఎం పరిపాలనతోపాటు చార్జి తీసుకునే విధంగా ప్రొఫెసర్ మురళికి బాధ్యతలు అప్పగించారు. మురళి 2012లో ఎంజీఎంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు స్వీకరించి అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా ఇక్కడే పదోన్నతులు పొందారు. ప్రస్తుతం కేఎంసీ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పరిపాలన అధికారిగా కూడా డాక్టర్ మురళి కొనసాగుతున్నారు.

అలాగే కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆర్థో విభాగం హెచ్‌వోడి డాక్టర్ కాటం రామ్ కుమార్‌రెడ్డి ఇన్‌చార్జి హోదాలో నియమితులయ్యారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్ దాస్ నర్సంపేట వైద్య కళాశాలకు బదిలీ కావడంతో ప్రస్తుతం వైస్ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే హను మకొండలోని టీబీ అండ్ చెస్ట్ ఆస్పత్రి సూపరిం టెండెంట్‌గా డాక్టర్ సునీత నియామకం అయ్యారు. ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్.. నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధి బృందం రెండు రోజుల్లో నగరంలోని పలు బోధన ఆస్పత్రులను తనిఖీ చేయనున్న నేపథ్యంలో ఇన్‌చార్జి బాధ్యతలు సీనియర్ ప్రొఫెసర్లకు అప్పగించారు.

భద్రతకు బీమా

- రూ.5లక్షలతో రైతు కుటుంబాలకు భరోసా
- దరఖాస్తులకు ఆగస్టు 5వరకు గడువు



వరంగల్ వ్యవసాయం, జూలై 23: అన్నదాత కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని అమలు చేస్తోంది. రైతు అకాల మరణం చెందితే ఆ కుటుంబం వీధిన పడొద్దనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. 2024-25 సంవత్సరానికి గాను రైతు బీమా 7వ సంవత్సరం నమోదు ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వమే ఎల్‌ఐసీ ప్రీమియం చెల్లించడమేకాక, ఏటా రెన్యూవల్ కూడా చేస్తోంది. ఈ సంవత్సరం జూన్ 28వరకు పట్టా పాస్‌బుక్ పొందిన రైతులకు కొత్తగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 5వ తేదీ వరకు అవకాశం కల్పించింది. దీనికి తోడు గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు ఆధార్, బ్యాంక్ ఖాతాలో మార్పులు, లేదా నామిని చనిపోతే పేరు మార్పు కోసం ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నిబంధనలివీ..

వ్యవసాయ భూమిని ధరణిలో పట్టా చేయించుకున్న 18 నుంచి 59 ఏళ్ల రైతులు ఈ బీమా పథకానికి అర్హులు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, నామిని ఆధార్ నకలు పత్రులను స్థానిక ఏఈవోలకు అందించాలి. వారు వ్యవసాయశాఖ సైట్‌లో తమ ఐడీతో లాగిన్ అయి సంబంధిత రైతుల వివరాలను నమోదు చేస్తారు. 14-8-1965 నుంచి 14-8-2006 వరకు జన్మించిన రైతులు అర్హులు ధరణి నుంచి 28 జూన్ 2024 వరకు పట్టాదార్ పాస్ బుక్ పొందిన రైతులు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పొందిన పట్టాదార్ పాస్‌బుక్‌లు రైతులు మాత్రమే ఎన్‌రోల్‌మెంట్‌కు అర్హులు. ఎల్‌ఐసీ ఐడీ ఉన్న రైతులు ఏదైన మార్పులు, నామిని మార్చుకునే రైతులు ఏఈవోను కలిసి ఎన్‌రోల్‌మెంట్ ఫాంపై సంతకం చేసి ఇవ్వాలి. సంబంధిత డాక్యుమెంట్స్ అందజేయాలి. ఈ సంవత్సరం చిన్న, సన్నకారు, మహిళా, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యత ఆధారంగా బీమా ఎన్‌రోల్‌మెంట్ చేయాల్సి ఉంటుంది.

దరఖాస్తుల గడువు..

- కొత్త పట్టాదారులు, పోడు భూమి యజమానులకు నమోదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అలాగే గతంలోనే పట్టాలు ఉండి రైతు బీమాకు నమోదవని వారు కూడా అర్హులే. వారు ఆగస్టు 5 తేదీ లోపు స్వయంగా ఏఈవోలను కలిసి ఎన్‌రోల్‌మెంట్ ఫాంపై సంతకం చేసి దరఖాస్తులను అందజేయాలి.
- గతంలో బీమా చేసుకుని ఐడీ నెంబరు కలిగి ఉన్న రైతులు.. తమ బీమాలో ఆధార్ వివరాలు, నామిని చనిపోతే వారి స్థానంలో మరో నామిని పేరు చేర్చడం లాంటి వాటి కోసం ఈ నెల 30వ తేదీ నాటికి సవరణకు దరఖాస్తు చేయాలి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఉషాదయాల్, జిల్లా వ్యవసాయాధికారి



ప్రభుత్వం కల్పించిన బీమా సౌకర్యాన్ని రైతు కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలి. మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.5 లక్షలు బీమా వస్తుంది. అర్హులైన ప్రతీ రైతు సమీప రైతు వేదికలోని ఏఈవోలను కలిసి సంబంధిత ధ్రువ పత్రాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. చివరి తేదీ ఆగస్టు 5లోపు చేయించుకోవాలి.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



నర్సంపేట ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

నర్సంపేట, జూలై 23: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. నర్సంపేట ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గైనిక్, పిడియాట్రిక్, డయాలసిస్, జనరల్ వార్డులను సందర్శించారు. వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా? మెను ప్రకారం భోజనం అందిస్తున్నారా.. అని రోగులను అడిగి తెలుసుకున్నారు. గైనిక్ వార్డును పరిశీలించి సాధారణ ప్రసవాలను పెంచాలని డాక్టర్లకు సూచించారు. ప్రతీరోజు రోగులకు అందిస్తున్న సేవల రికార్డులను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ఆస్పత్రిలో డయాలసిస్ విభాగం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఫార్మసీ సందర్శించి మందుల స్టాక్ వివరాల రికార్డులను పరిశీలించారు.

ఆస్పత్రి పనుల పరిశీలన

నర్సంపేటలో నిర్మాణంలో ఉన్న జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాల భవన నిర్మాణాలను ఈనెలలోనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సివిల్ వర్క్ దాదాపు పూర్తవగా, మిగిలిన పనులను పూర్తిచేయించి అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి భవనాన్ని నిర్వహణకు అధికారులకు అప్పగించాలంటూ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. కళాశాల నిర్వహణ, ఆస్పత్రిలో సేవలందించేందుకు అవసరమైన బోధనేతర సిబ్బంది, ఇతర మౌలిక వసతులు, పరికరాలు సమకూర్చుకుని వైద్య సేవలను అందించుటకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ గోపాల్, డాక్టర్ మనోజ్‌లాల్, వైద్యకళాల ప్రిన్సిపాల్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ఖానాపురం: జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రెవెన్యూ, నీటిపారుదల, ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మంగళవారం పర్యాటక ప్రాంతమైన పాకాల సరస్సును సందర్శించారు. పాకాల తూములు, మత్తడి ప్రదేశాన్ని పరిశీలించి, సరస్సు నీటి మట్టాన్ని పరిశీ లించారు. ఆయకట్టులో పండే పంటల సాగు విస్తీర్ణం, పాకాల అభయారణ్యం విస్తీర్ణం తదితర విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే కాలుష్యరహిత సరస్సుగా గుర్తింపు పొందిన పాకాల సరస్సు ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. సరస్సు పూర్తిస్థాయిలో నిండి మత్తడి పోస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులను అప్రమత్తం చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, ఐబీ డీఈ రమేష్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, డీఆర్వో నాగరాజు పాల్గొన్నారు.



పాకాల సరస్సు తూములను పరిశీలిస్తున్న కలెక్టర్

నేటి నుంచి రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 23: ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈ నెల 26 వరకు మూడు రోజుల పాటు వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ వేదికగా 10వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అండర్-17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన క్వాలిఫైయింగ్ రౌండ్‌లో వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారుల నుంచి 26మంది మెయిన్ డ్రాకు అర్హత సాధించినట్లు తెలిపారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్‌డబుల్స్ విభాగాల్లో మూడు రోజులు పాటు రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న బ్యాడ్మింటన్ పోటీలలో ఉమ్మడి పది జిల్లాల నుంచి క్వాలిఫైయింగ్ రౌండ్‌లో అర్హత సాధించిన వారితో కలిపి మొత్తం 146మంది క్రీడాకారులు మెయిన్ డ్రా పోటీలో పాల్గొంటారన్నారు. వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌తోపాటు ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనునన్న ఈ టోర్నీలో 15మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారన్నారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ దిగ్గజాలు కిదాంబి నందగోపాల్, విద్యాధర్, వరంగల్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు భోజన, వసతి వసతులను కల్పించనున్నామన్నారు. అదేవిధంగా ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో కేరళలో జరగనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి. రమేష్‌కుమార్, టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి డాక్టర్ జితేందర్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, కోచ్‌లు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి ఆర్థిక సహాయం

కేయూ క్యాంపస్, జూలై 23: అనారోగ్యంతో బాధపడుతున్న గణితశాస్త్ర అధ్యాపకుడు తాటిపాముల తిలక్‌కు గణితశాస్త్ర విభాగం మిత్రులు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందచేసి తమ సహృదయాన్ని చాటుకున్నారు. మహబూబాబాద్‌కు చెందిన గణితశాస్త్ర ప్రైవేట్ అధ్యాపకుడు తిలక్ తల్లి ఇటీవల చనిపోవడం, తన తండ్రి తిలక్ 18వ ఏటనే చనిపోవడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులలో ఉంది. దీనికి తోడు ఇటీవల తిలక్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో కేయూ రిజిస్ట్రార్, గణితశాస్త్రవిభాగం ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి తోడ్పాటుతో గణితశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.నాగయ్య, సతీశ్, యాకూబ్ పాషాలు కలిసి మిత్రులతో కలిసి తిలక్ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందచేశారు. అలాగే మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌కు తిలక్ కుటుంబ పరిస్థితిని విన్నవించి ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. తిలక్ కుటుంబానికి కనీసం రేషన్ కార్డు లేదని, పేదరికంతో ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. తిలక్ ఆర్థిక సహాయం చేసిన వారిలో రమేశ్, నరేశ్, భాస్కర్, నరహరి, యుగేందర్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలను చూపి ఆదాయ పన్ను చెల్లించాలి

హనుమకొండ టౌన్, జూలై 23: వాస్తవాలను చూపి ఆదాయం పన్ను చెల్లించాలని అసిస్టెంట్ కమిషనర్ ఇన్‌కామ్ టాక్స్ రేంజ్-3 హైదరాబాద్ ఎన్. సీతారామాంజనేయులు అన్నారు. మంగళవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో ఎన్పీడీసీఎల్ అకౌంట్స్ ఆఫీసర్లు, డ్రాయింగ్ ఆఫీసర్లు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్, డీసీబీ, ఏపీజీవీబీ బ్యాంకు అధికారులకు ఆదాయపన్నుపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ.. సీఏల దగ్గర కొంత మంది ఆదాయపన్ను ఫైలింగ్ విధానం నేర్చుకొని నగదు రీఫండ్ వచ్చేలా తప్పుడు ఫైలింగ్ చేస్తున్నారని, అలా చేయడం వల్ల జరిమానా విధించనున్నట్లు చెప్పారు. తిరిగి మరలా సవరించే వెసులుబాటు కల్పించామని, 2022-23 ఆర్థిక సంవత్సరానికి 50 శాతం వడ్డీ, 2023-24 ఆర్థిక సంవత్సరానికి 25 శాతం వడ్డీతో మరలా ఫైలింగ్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ వి.తిరుపతిరెడ్డి, జీఎంలు దేవేందర్, వేణుబాబు, సత్యనారాయణ, ఆదాయ పన్ను అధికారులు అవినాశ్, ఎన్పీడీసీఎల్ అకౌంట్స్ ఆఫీసర్లు డ్రాయింగ్ ఆఫీసర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.



కేంద్రం కనికరించలే!

- సెంట్రల్ బడ్జెట్‌లో వరంగల్‌కు మొండిచేయి
- నిర్మలమ్మ పద్దులో నిధుల కేటాయింపులు నిల్
- బడ్జెట్ తీరుపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న అసంతృప్తి



హనుమకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ సర్కారు ఉమ్మడి వరంగల్ జిల్లాకు మొండిచేయే చూపింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఎనిమిది నెలలకాలానికి గాను మంగళవారం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ సారి రాష్ట్రం నుంచి బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రానికి బడ్జెట్‌లో కేంద్రం పెద్ద పీట వేస్తుందని భావించారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు కూడా ఎన్నో కొన్ని కేటాయింపులుంటాయనుకున్నారు. కానీ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్న ఏ ఒక్క అంశమూ, పథకమూ లేకపోవడంతో అందరూ నిరాశకు గురయ్యారు. నిర్మలమ్మ పద్దుతో తమకు ఏం ఒరగలేదని ఉమ్మడి జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు.

బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ మాటేదీ?

రాష్ట్రాల విభజన హామీలో ఒకటైన మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు అంశం కూడా కేంద్ర బడ్జెట్‌లో కనిపించలేదు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఈ నాటిది కాదు. రెండు దశబ్దాలుగా ఇది నలుగుతోంది. దీనిపై స్థానిక ప్రజలు ఎన్నో సార్లు ఆందోళన చేశారు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ఈ అంశం చర్చకు వస్తుంది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కూడా ప్రస్తావనకు వచ్చింది. బీజేపీ అగ్రనేతలు సైతం తమ పార్టీ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే బయ్యారం ఉక్కువ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ కూడా ఇచ్చారు. బీజేపీ ముచ్చటగా మూడోసారి తిరిగి అధికారంలో రావడంతో ఉక్కు ఫ్యాక్టరీ కల నెరవేరుతుందని స్థానిక ప్రజలు ఎంతగానో ఆశించారు. కానీ బడ్జెట్‌లో ఈ అంశాన్నే ప్రస్తావించకపోవడంతో నిరాశకు లోనయ్యారు.

గిరిజన విశ్వవిద్యాలయం

ములుగులో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్న గిరిజన విశ్వవిద్యాలయానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ములుగు జిల్లా జాకారం వద్ద ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు పనులు గత సంవత్సరమే ప్రారంభమయ్యాయి. ఈవిద్యాసంవత్సరం నుంచే తరగతులు మొదలు కావలసి ఉండింది. జాకారంలోని వైటీసీ భవనంలో తాత్కాలికం గా తరగతులను నిర్వహించేందుకు సన్నాహాలు మొదల య్యాయి. విశ్వవిద్యాలయం ఏర్పాటు పర్యవేక్షణకు ఒక ప్రత్యేకాధికారిని కూడా నియమించారు. దీని నిర్వహణ బాధ్యతను హైదరాబాద్‌లోని కేంద్రియ విశ్వవిద్యాలయానికి అప్పగించారు. కానీ విశ్వవిద్యాలయం ఏర్పాటు పనులు పూర్తికి అవసరమైన నిధుల కేటాయింపు ప్రస్తావన మాత్రం బడ్జెట్‌లో చేయలేదు. దీనితో విశ్వవిద్యాలయం నిర్వహణపై నీలినీడలు పరుచుకున్నాయి. నిధులలేమి వల్ల విశ్వవిద్యాలయం పనుల పూర్తికి మరింత జాప్యం జరగవచ్చు.



కోచ్‌ఫ్యాక్టరీ ఏమైంది?

ఎంతో కాలంగా వరంగల్ ప్రజలు డిమాండ్ చేస్తున్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి ఈ సారి కూడా మోక్షం కలుగలేదు. కేంద్ర బడ్జెట్‌లో దీని ప్రస్తావనే లేదు. రెండు దశబ్దాలుగా వరంగల్ ప్రజలు కోచ్ ఫ్యాక్టరీ కోసం పోరాటం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ఈ అంశం ప్రధాన ఎజెండాగా నిలుస్తూ వచ్చింది. ఓటర్లను ఆకర్షించేందుకు కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రకటనలు చేయడం మినహా.. ఇప్పటివరకు ఈ కల సాకారం కాలేదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి బదులు ఓవర్ హాలింగ్ వ్యాగన్ వర్క్‌షాపు ఏర్పాటుతో సరిపెట్టింది. అయినప్పటికీ కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ ఇప్పటికీ సజీవంగానే ఉంది. దీంతో ప్రతీసారి బడ్జెట్‌లో ఈ ఫ్యాక్టరీ ప్రస్తావన ఉంటుందన్న ఆశతో ప్రజలు ఎదురుచూడడం.. చివరకు నిరాశకు గురికావడం పరిపాటిగా మారింది. ఈ సారి కూడా అదే జరిగింది.

కాజీపేట రైల్వే డివిజన్ అంతే..

బడ్జెట్‌లో కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా మార్చాలన్న ప్రతిపాదన కూడా బడ్జెట్‌లో కనిపించలేదు. ఉత్తర, దక్షిణభారత దేశాలను కలిపే అతిపెద్ద రైల్వే జంక్షన్ అయిన కాజీపేటను డివిజన్‌గా మార్చాలన్న ప్రతిపాదన చాలా ఏళ్లనాటిది. దీనిపై అనేకసార్లు పోరాటాలు కూడా జరిగాయి. డివిజన్ కేంద్రంగా మారిస్తే కాజీపేట జంక్షన్ రూపురేఖలు మారుతాయి. రవాణా, వ్యాపార, వాణిజ్యపరంగా ఈప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. రైల్వే డివిజన్‌గా ఉన్నతీకరించడానికి కాజీపేట జంక్షన్‌కు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రైల్వే శాఖ పట్టించుకోవడం లేదు. దీంతో డివిజన్ కల కలగానే మిగిలిపోయింది. ఈసారి బడ్జెట్‌లో కూడా ఆ ఊసే లేకపోవడంతో జిల్లా ప్రజలు ఉసూరుమంటున్నారు.

కొత్త రైల్వే లైన్లు..

వరంగల్ జిల్లాకు సంబంధించిన కొత్త రైల్వే లైన్లు, ప్రాజెక్టులు, ఆధునీకరణ పనులకు ప్రతిపాదనలు కూడా నిర్మలమ్మ బడ్జెట్‌లో చోటు దక్కలేదు. కాజీపేట మీదుగా కొన్ని రైల్వేలైన్ల డిమాండ్ చాలా కాలంగా ఉంది. వాటి ప్రస్తావన లేదు. కాజీపేట - భూపాలపల్లి రైల్వే, అలాగే రామగుండం - మణుగూరు వయా భూపాలపల్లి రైల్వేప్రతిపాదనలు వీటిలో కొన్ని. ఇందులో రామగుండం - మణుగూరు రైల్వే లైన్ సర్వేకు గత బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించారు. ప్రస్తుత బడ్జెట్‌లో వీటి ఊసేలేకపోవడంతో కేంద్రం రైల్వే ప్రాజెక్టుల విషయంలో మరోసారి మొండి చేయి చూపినట్లు అయింది.

సైనిక్ స్కూల్ ఏమైంది!

హనుమకొండ జిల్లాలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అంశం కూడా కేంద్ర బడ్జెట్‌లో కానరాలేదు. జిల్లాకు సైనిక్ స్కూల్ మంజూరు గతంలోనే జరిగింది. మడికొండ సమీపంలో దీని ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఇందుకు అవసరమైన స్థలం కేటాయింపునకు గత ప్రభుత్వం ముందుకు వచ్చింది. కానీ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల సైనిక్‌స్కూల్ ఏర్పాటులో ఐదేళ్లుగా జాప్యం జరుగుతోంది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కూడా ప్రధాన ప్రచార అంశంగా చర్చకు వచ్చింది. వరంగల్ ఎంపీగా గెలిచిన డాక్టర్ కావ్య సైతం ఈ అంశాన్ని లోక్‌సభలో చర్చిస్తానని చెప్పారు. దీనిపై కేంద్రానికి లేఖ రాస్తానన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా బీజేపీ అగ్రనేతలు సైనిక్ స్కూల్ ఏర్పాటుపై హామీ ఇచ్చారు. తీరా బడ్జెట్‌లో చూస్తే ఆ ఊసే లేదు.

కాళేశ్వరానికి జాతీయ హోదా ఎప్పుడు?

తెలంగాణ రాష్ట్రంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులైన కాళేశ్వరం, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులలో ఏదైనా ఒకదానికి జాతీయ హోదా ఇవ్వాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిపై కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ దిశగా కేంద్రంతో చర్చించింది. అయినా కూడా కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశం బడ్జెట్‌లో కనిపించలేదు.

విమానాశ్రయం ఊసేలేదు



ఉడాన్ పథకం కింద మామునూరులోని విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలన్న అంశానికి కూడా బడ్జెట్‌లో చోటు దక్కలేదు. ఉడాన్ పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలో భాగంగా మామునూరు ఎయిర్‌పోర్టు విస్తరణ అంశం చాలా ఏళ్ల నుంచి నలుగుతోంది. విమానాశ్రయాన్ని త్వరలో అభివృద్ధి చేయనున్నట్టు ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. సర్వేలు కూడా జరిగాయి. ఇందుకు అవసరమైన భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చింది. అయితే కేంద్ర విమానాయాన మంత్రిత్వ శాఖ ఈ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. బడ్జెట్‌లో ప్రతిపాదిస్తే అభివృద్ధికి ముందడుగుపడేది. కానీ ఈసారి బడ్జెట్‌లో ఆ అవకాశమే కల్పించలేదు.

అవీ ఇవీ..

మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి కేంద్రం తన వంతుగా ఈ సారి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని ఉమ్మడి జిల్లా ప్రజలు పడిన ఆశ నిరాశే అయింది. ఈ పార్క్‌కు కేంద్రం తన వంతు వాటాగా రూ.500 కోట్లను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. హైదరాబాద్ - వరంగల్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు అంశం కూడా బడ్జెట్‌లో కనిపించలేదు. వరంగల్ నగరంలో ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి గత ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన నియో రైతు ప్రాజెక్టుకు కేంద్రం తనవంతుగా సమకూర్చాల్సిన నిధుల ప్రస్తావన కూడా బడ్జెట్‌లో పేర్కొనలేదు.



మేడారానికి జాతీయ పండుగ గుర్తింపు డిమాండ్‌ను పట్టించుకోలే..

మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరను జాతీయ పండుగగా కేంద్ర ప్రభుత్వం గుర్తించాలన్న డిమాండ్ కూడా చాలాకాలంగా జిల్లా ప్రజలు చేస్తున్నారు. మేడారం ఆసియా లోకెల్లా అతిపెద్ద జాతర. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరకు రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి సైతం కోటిన్నర మందికిపైగా భక్తులు హాజరవుతుంటారు. చారిత్రకంగా, ఆదివాసీ సంప్రదాయంపరంగా విశిష్టత, ఔన్నత్యం ఉన్న ఈ జాతరను స్టేట్ ఫెస్టివల్‌గా గతంలోనే ప్రకటించినప్పటికీ నేషనల్ ఫెస్టివల్‌గా చేయాలన్న డిమాండ్‌ను జిల్లా ప్రజలు చాలా కాలంగా చేస్తున్నారు. జాతర జరిగిన ప్రతీసారి ఈ డిమాండ్ ప్రధానంగా చర్చకు వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు కూడా పంపింది. ఈ విషయంలో కేంద్రం వద్ద పరిశీలనలో ఉంది. ఈ యేడు ఫిబ్రవరిలో జాతర జరిగిన సందర్భంలో వనదేవతలను దర్శించుకునేందుకు వచ్చిన బీజేపీ అగ్రనేతలు మేడారం జాతరను నేషనల్ ఫెస్టివల్‌గా ప్రకటించేలా కృషి చేస్తామని హామీలు గుప్పించారు. అప్పుడు కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి సైతం ఈ మేరకు వాగ్దానం చేశారు. కానీ దానిని ఎన్‌డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రస్తావించడం ద్వారా నెరవేర్చే దిశగా ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో జిల్లా ప్రజలు, ముఖ్యంగా ఆదివాసీలు మరోసారి నిరాశకు గురయ్యారు.

ఇది 'కుర్చీ బచావో' బడ్జెట్

డాక్టర్ కడియం కావ్య, వరంగల్ ఎంపీ



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. 'కుర్చీ బచావ్ బడ్జెట్'. ఎన్డీఏ ప్రభుత్వం నిలబడడానికి బిహార్, ఆంధ్రప్రదేశ్‌లకు తాయిలాలు ఇచ్చింది. తమ కూటమిని నిలుపుకోసేందుకు బీజేపీ సంతృప్తివాద రాజకీయాలు అనుసరిస్తోంది. ఇదంతా బీజేపీ క్విడ్ ప్రోకో వ్యవస్థను నడుపుతున్నట్టు ఉంది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఎలాంటి కేటాయింపులు లేకపోవడం బాధాకరం. గత పదేళ్లలో బీజేపీ, బీఆర్ఎస్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశాయి. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించడం లాంటివాటిపై పట్టింపేలేదు. తెలంగాణ పుట్టుకను ఇష్టపడని ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంపై వివక్ష చూపుతూనే ఉన్నారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మరోసారి రాష్ట్రానికి మొండి చేయి చూపి.. వివక్షను కొనసాగించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు బీజేపీ ఎంపీలు దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ అన్యాయాన్ని పార్లమెంట్ వేదికగా ప్రశ్నిస్తాం. రాష్ట్రానికి నిధుల కేటాంపులో జరిగిన వివక్షపై నిలదీస్తాం.

రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ ఊసేలేదు

జంగా రాఘవరెడ్డి, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్



కేంద్ర బడ్జెట్‌లో కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఊసే లేకపోవడం నిరాశకు గురిచేసింది. కేంద్ర సర్కారు జిల్లాకే కాకుండా తెలంగాణకు కూడా తీవ్ర అన్యాయం చేసింది. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా బడ్జెట్‌లో మాత్రం రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా నిధులు కేటాయించకుండా నిరాశ మిగిల్చింది. ఈ బడ్జెట్‌లో బిహార్, ఏపీకి మాత్రమే నిధులు కేటాయించి పక్షపాతం చూపింది. రాష్ట్ర విభజనలో భాగంగా ఇచ్చిన 35 హామీలు, ములుగు గిరిజన యూనివర్సిటీకి అదనపు నిధులు, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదాను తుంగలో తొక్కింది. ఇప్పుడు రాష్ట్రానికి చెందిన బీజేపీ మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్ ఏముఖం పెట్టుకుని ప్రజల్లో తిరుగుతారు? రాబోయే ఎన్నికల్లో బీజేపీని బొందపెడతారు.

బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి..

నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే



రాష్ట్ర ప్రజలు బీజేపీకి చెందిన ఎనిమిది మందిని ఎంపీలను గెలిపించారు. కానీ కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు, వనరుల రూపంలోనూ మొండి చేయే చూపింది. దీనికి బాధ్యత వహిస్తూ ఆ ఎంపీలంతా వెంటనే రాజీనామా చేయాలి. బడ్జెట్‌పై రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటే వారిని కేంద్రం వంచించింది. ఇక ఓరుగల్లు జిల్లాకు సంబంధించిన విభజన హామీలను కేంద్రం విస్మరించింది. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, జంక్షన్, నాలుగో రైల్వేలైన్, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, జాతీయ రహదారుల విస్తరణ ఊసే లేదు. రాష్ట్రానికి నిధులు తేవడంలో బీజేపీ ఎంపీలు విఫలమయ్యారు. వారు ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలి.

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

బొట్ల చక్రపాణి, సీపీఎం హనుమకొండ కార్యదర్శి



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ ప్రస్తావనే లేదు. బీజేపీ తన రాజకీయ మనుగడ కోసమే బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అధిక కేటాయింపులు చేసింది. దేశంలో అత్యంత కీలకమైన వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించారు. వేతన జీవుల ఆశలను అడియాశలు చేసింది. 40లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు కానీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం వల్ల ఎలా సాధ్యమవుతుంది. బాలింతలకు పౌష్టికాహారం అందించే పోషణ్ పథకం నిధులకు కోత పెట్టారు. దేశంలోని కార్పొరేట్ శక్తులకు పన్నులు వేయకుండా 20 లక్షలలోపు ఆదాయం ఉండే మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం మోపారు.

రాష్ట్రానికిచ్చిన హామీలను మరిచారు..

తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి మొండిచేయి చూపారు. విభజన హామీలైన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, రాష్ట్రానికి నిధులు రాబట్టలేక పోయిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి. అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన ప్రధాని కొన్ని రాష్ట్రాలకే నిధులు కేటాయించి తెలంగాణకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించడాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం.

ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఊతం

జలగం రంజిత్‌రావు, బీజేపీ నాయకులు



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవా రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ దేశం లోని యువతకు ఉపాధి అవకా శాలు మెరుగు పరుస్తూ ఉద్యోగావకాశాలకు ఊతమిచ్చే దిగా ఉంది. కేంద్ర బడ్జెట్ మహిళలు, యువతకు సాధికార త కల్పించే దిశగా అడుగులేసింది. భారతీయ ఆకాంక్ష లు, విశ్వాసానికి కేంద్ర బడ్జెట్ ప్రతిబింబంలా నిలిచింది. ప్రజా అనుకూల, అభివృద్ధి సానుకూల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టి మార్గదర్శక బడ్జెట్‌ను ప్రవేశట్టి భారత్ అభివృద్ధికి బంగారు బాటలు వేశారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఎంప్లాయిమెంట్ బేస్డ్ స్కీమ్ ద్వారా కొత్త ఉద్యోగాల కల్పనకు బాటలు వేసింది. ముద్ర రుణాల పరిధిని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలనుకునే యువతకు చేయూతనందించింది. ఎంఎస్ఎంఈలకు రుణాలను అందించే కొత్త పథకాన్ని ఈ బడ్జెట్‌లో పొందు పరిచారు. బంగారం, వెండిపై కస్టమ్స్ డ్యూటీని ఆరు శాతానికి, ప్లాటినంపై 6.4 శాతానికి తగ్గించడంతో బంగారు, వెండి, ప్లాటినం ఆభరణాల ధరలు తగ్గుతాయి. క్యాన్సర్ ఔషధాలు, ఎక్స్‌రే మిషన్లపై ట్యాక్స్ తగ్గించడం వైద్య రంగానికి అనుకూలంతో పాటు పేదలకు వైద్యం అందే అవకాశం ఉంది. బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేదయం హర్షణీయం.

బడ్జెట్‌లో తెలంగాణ పదమే ఉచ్చరించలేదు

ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు



కేంద్రం.. బడ్జెట్‌లో తెలంగాణ పదమే ఉచ్చరించలేదు. రాష్ట్రం నుంచి బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలున్నా రాష్ట్రానికి అన్యాయమే జరిగింది. బడ్జెట్‌లో తెలంగాణకు ఏమైనా నిధులు ప్రకటిస్తారని ఎదురు చూసిన ప్రజల నోట్లో ప్రధాని మోదీ మట్టికొట్టారు. రూ.48.21లక్షల కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కేవలం బిహార్, ఆంధ్రప్రదేశ్‌కే పెద్దపీట వేశారు. తెలంగాణలోని పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుల ఊసేలేదు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ మాటే ఎత్తలేదు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, సంజయ్ ఏం చేస్తున్నారు? రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేస్తోందన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. అవకాశం వచ్చినప్పుడు వాత పెట్టడం ఖాయం.

ఉద్యోగస్తులకు నిరాశను మిగిల్చింది

టీఆర్‌టీఎఫ్ జిల్లా చీఫ్ పాటర్న్ లకిరెడ్డి సంజీవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాసిరిరాజి బాపురావు




కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగస్తులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగస్తులను కేంద్ర బడ్జెట్ ఉసూరుమనిపించింది. గత పదేళ్లుగా ఊరట కల్పిస్తారని ఎదురు చూస్తున్న ఉద్యోగులకు బీజేపీ ప్రభుత్వం ఈ ఏడాది నిరాశనే మిగిల్చింది. భారీ ఊరట లభిస్తుందనుకున్న ఉద్యోగులకు ఎలాంటి ఊరట లభించలేదు. పాత పన్ను విధానంలో ఎలాంటి మినహాయింపు లేకుండా పోయింది. బడ్జెట్ ద్వారా కొత్త పన్ను విధానాలను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది.

విద్యారంగానికి ప్రాధాన్యమేదీ?

డి.శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



రూ.48.21 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు 1.26 లక్షల కోట్లు మాత్రమే. గత సంవత్సరం బడ్జెట్ 1.12 లక్షల కోట్లు కాగా ఈ సంవత్సరం కొంత మేర పెరిగినప్పటికీ ఇది మొత్తం బడ్జెట్‌లో 2.59 శాతమే. ఈ నిధులు ఏ మాత్రం విద్యాభివృద్దికి సరిపోవు. బడ్జెట్‌లో విద్యకు కనీసం 6 శాతం కేటాయిస్తేనే విద్యాసంస్థలకు మౌలిక వసతులు కల్పించగలం, కొత్తగా ఉపాధ్యాయులను నియమించగలం, విద్యాప్రమాణాలు పెంచగలం. ఈ అరకొర నిధులతో వికసిత భారత్‌లో విద్యా వికాసం ఎండమావిలో నీటిని వెతికినట్లే ఉంటుంది. ఉద్యోగులపై ఆదాయ పన్ను విధానం కూడా మోసపూరితంగా ఉంది. పెద్దగా మార్పులేమీ లేవు. ధరల పెరుగుదలకు అనుగుణంగా పన్ను మినహాయింపు.. కనీస ఆదాయం పెంచకపోవడం, సెక్షన్ 80సీ పరిమితి పెంచక పోవడం ఉద్యోగులను నిరాశపరిచింది.

రాష్ట్రానికి మొండిచేయి చూపారు..

సీహెచ్ రాజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్ర ఊసేలేదు. దేశంలో అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన కేంద్ర ప్రభుత్వం బిహార్, అంధ్రప్రదేశ్ సీఎంలకు భయపడి పదవి కాపాడుకోవడానికి ఆయా రాష్ట్రాలకు బడ్జెట్లో పెద్ద పీట వేసింది. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి వెంటనే ఎంపీ పదవులకు రాజీనామా చేయాలి. రాష్ట్ర ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

వికసిత్ భారత్ నిర్మాణ లక్ష్యంగా బడ్జెట్

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



వికసిత్ భారత్ నిర్మాణమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరికి ఉపాధి, అంత్యోదయ అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర బడ్జెట్ ఉంది. పేదలు, యువత, అన్నదాతలు, మహిళలు, పన్ను చెల్లింపుదారులకు మేలు కలిగించడమే ధ్యేయంగా కేంద్రం పనిచేస్తోంది.

వికసిత్ భారత్ దిశగా కేంద్ర బడ్జెట్

పీవీ నారాయణరావు, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యంగా ఉంది. స్థిర ఆర్థిక వృద్ధి పెంపుదల, ఉద్యోగ అవకాశాలను పెంపొందించటంలాంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ద్రవ్యలోటును 4.9 శాతానికి అంటే.. జీడీపీపై 5 శాతం కిందకు తీసుకురావడం మంచి పరిణామం. రానున్న ఐదేళ్లలో 20 లక్షల నైపుణ్య యువతను తయారు చేయడం, ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకాల ప్రకటన, మరో 50 లక్షల ఉద్యోగ కల్పన ఒక శుభవార్త. మొబైల్స్, చార్జర్స్‌పై కస్టమ్ సుంకాన్ని తగ్గి తగ్గించడంతో ధరలు తగ్గే అవకాశం ఉంది. బంగారం, వెండిపై కూడా కస్టమ్ డ్యూటీ తగ్గించటంతో వాటి ధరల్లో మార్పు రావచ్చు.

ఇది మిశ్రమ బడ్జెట్

త్రిపురనేని గోపీచంద్, సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్, హనుమకొండ



కేంద్ర 2024-25 వార్షిక బడ్జెట్ సామాన్య ప్రజలకు, రైతులకు, విద్య, వైద్య రంగాలకు, మౌలిక వసతుల కల్పన, రోడ్లు, రైతు, విమానాశ్రయాలు, జల రవాణా, పోర్టుల అభివృద్ధి, మహిళా అభ్యున్నతి లక్ష్యంగా ఉంది. 2045 సంవత్సరం నాటికి వికసిత్ భారత్ సాధన దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయి. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, గృహనిర్మాణాలు, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర వాటికి కేటాయింపులు సంతృప్తికరంగా ఉన్నాయి. ఆదాయపు పన్నులో ఉద్యోగ వర్గాలకు రూ.17,500 నుంచి తగ్గింపు ప్రామాణితను రూ.75వేలకు పెంచడం పన్ను స్లాబులలో మార్పు మంచి చర్య. కానీ బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రాలను సమానంగా చూడకుండా బిహార్, ఆంధ్రప్రదేశ్, బెంగాల్, ఈశాన్య ప్రాంతాలకు అధిక కేటాయింపులు జరిపి తెలంగాణకు మొండిచేయి చూపడం అత్యంత బాధాకరం.

అస్తి అమ్మకంపై ఇండెక్సేషన్ తొలగింపు

తిప్పర్తి రాఘవ రెడ్డి, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్



అస్తి అమ్మకంపై ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తీసివేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. దీనివల్ల ఆస్తిని విక్రయించే చాలామంది ఇప్పుడు కొనుగోలు ధరను పెంచలేరు. వారి మూల ధరను తగ్గించలేరు. ప్రకటనకు ముందు ఆస్తి విక్రయం ద్వారా ఉత్పన్నమయ్యే దీర్ఘకాలిక మూలధన లాభాలపై ఇండెక్సేషన్ ప్రయోజనంలో 20 శాతం పన్ను విధింపబడింది. ఇప్పుడు బడ్జెట్ ప్రకారం ఇండెక్సేషన్ ప్రయోజనం లేకుండా కొత్త ఎల్‌టీసీజీ పన్నురేటు 12.5 శాతం ఆస్తిపన్నుపై మూల ధన లాభాలకు వర్తిస్తుంది.

విద్యారంగానికి నిధులు విస్మరించారు

కడారి భోగేశ్వర్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెటిన వికసిత భారత్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించాల్సిన నిధులను విస్మరించింది. గత ఏడాది బడ్జెట్‌లో 2.61 శాతం నిధులను కేటాయించిన ఇదే కేంద్ర ప్రభుత్వం.. ప్రస్తుత బడ్జెట్‌లో మాత్రం 2.59 శాతం నిధులను మాత్రమే కేటాయించింది. 1964లో కొఠారి కమిషన్, 1980లో జాతీయ విద్యావిధానం, 2020లో నూతన జాతీయ విద్యా విధానం బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం నిధులను కేటాయించాలని స్పష్టం చేసినా అవేమీ పట్టించుకోలేదు. ప్రస్తుత బడ్జెట్‌లో కేంద్రం కేటాయించిన నిధులతో విద్యార్థులకు నైపుణ్య ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం సాధ్యపడదు. ఈ నిధులతో కొత్తగా విద్యాసంస్థలను ఏర్పాటుచేసి మరిన్ని విద్యావకాశాలను కల్పించేందుకు అస్కారం లేదు.

ఉద్యోగులకు తీవ్ర నిరాశ

పెండెం రాజు, యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి



కేంద్ర బడ్జెట్ ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసింది. రూ.48లక్షల ఇరవై ఒక్క వేల కోట్ల బడ్జెట్‌లో ఉద్యోగులకు దక్కిందేమీ లేదు. ఏడేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతీసారి ఉగ్యోగులకు చేదు అనుభవమే ఎదురవుతోంది. కనీసం 80సీ పరిమితిని కూడా పెంచలేదు. పాత పన్నుల విధానంలోనే కొత్త స్లాబులను మార్చారు. దీంతో ఉద్యోగస్తులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ప్రస్తుతం మెజారిటీ ఉద్యోగులు పాత పన్ను విధానంలోనే ఆదాయపు పన్నును చెల్లిస్తున్నారు. పన్ను చెల్లింపుదారులందరినీ ఎలాంటి లాభంలేని కొత్త పన్ను విధానంవైపు మళ్లించే విధంగా ప్రస్తుత బడ్జెట్ ఉంది.

ఓరుగల్లుకు అన్యాయం చేశారు..

రావుల శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాది, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి



కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు అన్యాయం చేశారు. కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ లాంటి వాటి ఊసే లేదు. ఈ బడ్జెట్‌లోనైనా కేటాయింపులు జరుగుతాయని ఆశించాం. కానీ నిరాశే మిగిలింది. జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఒక్క ప్రాజెక్టుకు కూడా నిధులు కేటాయించకపోవడం వివక్షే. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఏ ఒక్క కేటాయింపు జరగలేదు.

ఘనంగా తిలక్ జయంతి వేడుకలు

వరంగల్‌సిటీ, జూలై 23: కాశిబుగ్గ తిలక్‌రోడ్ జంక్షన్‌లో బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం లోకమాన్య బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు సముద్రాల పరమేశ్వర్ తిలక్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వరాజ్యం నా జన్మహక్కు అని ప్రకటించి స్వాతంత్ర్య ఉద్యమంలో యువతను తీసుకువచ్చిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, కార్యదర్శి గడల కుమార్, నాయకులు సిద్దోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.



తిలక్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

ఉన్నతులుగా తీర్చిదిద్దుతోన్న 'ఆరెల్లి'

● 74 ఏళ్లుగా నాణ్యమైన విద్య ● వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ● ఆదర్శంగా నిలుస్తున్న కోటలోని ప్రభుత్వ పాఠశాల

ఖిలావరంగల్, జూలై 23: ఖిలావరంగల్‌లోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎంతోమందిని ఉన్నతులుగా తీర్చిదిద్దుతోంది. మధ్యకోటలో 1950లో ప్రారంభమైన ఈ పాఠశాలలోఎంతో మంది వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడడం విశేషం. వివిధ ప్రాంతాలనుంచి సుమారుగా 500మందికి పైగా విద్యార్థులు ఏటా విద్యనభ్యసిస్తుంటారు. మూడు దశాబ్దాల క్రితం ఖిలావరంగల్ ప్రాంతానికి చెందిన వరంగల్ మాజీ ఎమ్మెల్యే, వరంగల్ నగరపాలక సంస్థ తొలిచైర్మన్‌గా వ్యవహరించిన దివంగత ఆరెల్లి బుచ్చయ్య జ్ఞాపకార్థం ఈ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు, ఆరెళ్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉ న్నత పాఠశాల అని నామకరణం చేశారు. కాగా, గత 15 ఏళ్ల నుంచి విద్యార్థుల సంఖ్య క్రమక్రమంగా తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రధానోపాధ్యాయుడు వెంకటనారాయణ స్థానిక విద్యావంతులతో ఓ కమిటీని వేసి, వేసవికాలంలో సొంత ఖర్చులతో బ్యానర్లు, పోస్టర్లు ముద్రించి ఇంటింటికి తిరిగి విద్యార్థుల శాతాన్ని పెంచేందుకు తనవంతు కృషి చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



మధ్యకోటలో 74 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఆరెళ్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పచ్చనిచెట్లు, పర్యావరణంతో అలరారుతోంది. అన్ని సబ్జెక్టులకు తగిన ఉపాధ్యాయులు, విద్యన ందిస్తున్నారు. అనువైన భవనం, మిషన్ భగీరథ నీరు, మినరల్ వాటర్ సౌకర్యాలన్నాయి. 6 నుంచి 10 వరకు ఇంగ్లీషు మీడియంలో మెరుగైన విద్యనందిస్తున్నాం. - బత్తుల ప్రసాద్, హెచ్‌ఎం

పూర్వవిద్యార్థుల దాతృత్వం..

పూర్వ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుంటున్నారు. 1976-77 బ్యాచ్ మూడు గదులకు మరమ్మతు చేయించారు. 1978-79 బ్యాచ్ పాఠశాల ముందు స్టేజిని, రెకుల షెడ్డును నిర్మించారు.1993-94 బ్యాచ్ ఆవరణలో సరస్వతి, సర్వేపల్లి రాధాకృష్ణ, మహాత్మాగాంధీ, విగ్రహంతో ఓ గదిని నిర్మించారు. 1984-85 బ్యాచ్ కంప్యూటర్ గదికి గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. 1983-84 బీరువా, గ్రంథాలయంలో పుస్తకాలు తదితర వసతులను ఏర్పా ట్లు చేశారు. అలాగే ఆరెళ్లి బుచ్చయ్య మేనల్లుడు రవి 8,9,10 తరగతి విద్యార్థులకు (ఐఎఫ్‌టీ) డిజిటల్ టీవీలను అందించాడు. బాలుర టాయిలెంట్స్‌ను పునరిర్మాణం చేశాడు.

పాఠశాలలో చదువుకున్న వారెందరో..

ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు గతంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా, కేయూ ప్రొఫెసర్ బుర్ర రాములు, భోపాల్ యూనివర్సిటీ డీన్‌గా ప్రొఫెసర్ బుర్ర రమేష్, కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా నాగవెళ్లి సాంబయ్య, టీచర్ ట్రైనింగ్ ప్రిన్సిపాల్‌గా నాగభూషణం, పోలీస్ ఎస్పీ, ఏఆర్‌లుగా పాలకుర్తి యాదగిరి, మల్లేశం, తహసీల్దార్‌గా జూలూరి సుభాషిణి ఇక్కడ చదువుకున్నవారే. అలాగే రాజకీయాలలో ఏసీరెడ్డి ఈశ్వరయ్య, కొప్పుల ఎల్లయ్య, భూతం సారంగ పాణి, నాగవెళ్లి వెంకట్రాములు, నలిగంటి రత్నమాల పూర్వవిద్యార్థులే కావడం విశేషం. ఖోఖోలో అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి కప్పును తీసుకువచ్చి వ్యక్తి నాగవెళ్లి సారంగపాణితోపాటు, ఎంతో మంది దేశ విదేశాలలో ఉన్నత రంగాల్లో స్థిరపడ్డారు.



పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి మందిరం, సర్వేపల్లి, మహాత్మా గాంధీ విగ్రహాలు



ఆరెళ్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల

వైద్యుడిగా బాధ్యతలు స్వీకరించిన వంశీకృష్ణ



సంగెం, జూలై 23 : మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడిగా డాక్టర్ వంశీకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వంశీకృష్ణ గతంలో మహబూబాబాద్ జిల్లాలో పనిచేసి బదిలీపై సంగెంకు వచ్చారు. ఈసందర్భంగా పలువురు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.

బాధితుడికి 'చల్లా' పరామర్శ

గీసుగొండ, జూలై 23: గొర్రెకుంటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మంగళవారం శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించారు. కార్పొరేటర్‌లు సుంకరి మనీషాశివకుమార్, ఆకులపెల్లి మనోహర్, మాజీ కార్పొరేటర్ ల్యాదెల్ల బాలు, మాజీ మార్కెట్ డైరెక్టర్ గోలి రాజయ్య పాల్గొన్నారు.

అమ్మవారి ప్రసాదానికి రూ.లక్ష విరాళం

వరంగల్‌కల్చరల్, జూలై 23: చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో భక్తులకు ఉచితంగా అందజేసే ప్రసాద వితరణ కార్యక్రమానికి మంగళవారం కొత్తగూడెంకు చెందిన హీరాలాల్ రాజేంద్రకుమార్ అగర్వాల్ అనే భక్తుడు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ ఈవో శేషు భారతికి అందజేశారు. ఈ దాత మహరాజ పోశకులుగా ఉంటారని ఈవో తెలిపారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా హోర్డింగులు

వరంగల్ చౌరస్తా, జూలై 23: గంజాయి, మత్తు పదార్థాలు సేవించవద్దని, వాటి విక్రయానికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఇంతేజార్‌గంజ్ పోలీసులు భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. గంజాయి రవాణా సమాచారాన్ని తెలిపిన వారికి నగదు పురస్కారం అందజేసి వారి వివరాలను గోప్యంగా ఉంచుతా మని సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ సీపీ ఆదేశాల మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో పోచమ్మమైదాన్ జంక్షన్‌లో మంగళవారం హోర్డింగ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. మత్తు పదార్థాలు రవాణా చేస్తున్న వారి గురించి సమాచారాన్ని ఫోన్ నంబర్ : 8712584473కు తెలపాలని కోరారు.



పోచమ్మ మైదాన్‌లో ఏర్పాటు చేసిన హోర్డింగ్

మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జూలై 23: జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. విద్యాసంస్థల సమీపంలోని కిరాణా షాపుల వేదికగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించే అనుమానాస్పద ప్రాంతాల్లో పటిష్ట నిఘా పెంచాలని పోలీస్ అధికారులకు సూచించారు. మత్తు పదార్థాలు దిగుమతి అయ్యే అవకాశాలు ఉన్నందున రైలు మార్గాలు, రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లలో నిఘా పెంచి అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు గంజాయి సాగుచేయకుండా తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాలు వస్తే అలాంటి రైతులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అనుమానిత ప్రాంతాలైన ఉర్సు, శివనగర్, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇతర ప్రాంతాల్లో గంజాయి స్మగ్లింగ్, గంజాయి వ్యసనానికి అలవా టుపడుతున్న యువత స్థితిగతులను పసిగట్టినట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 8712661111కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్, వ్యవసాయ అధికారి ఉషాద యాల్, నర్సంపేట, వర్ధన్నపేట ఏసీపీలు కిరణ్ కుమార్, నర్సయ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డీఈవో వాసంతి, అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి మురళి, డీఎఫ్ఓ సదానందం, డ్రగ్ కంట్రోల్ కానిస్టేబుల్ నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

మండలి బీఆర్ఎస్ పక్ష నేతగా 'సిరికొండ'



భూపాలపల్లిటౌన్, జూలై 23: శాసన మండలిలో బీఆర్ఎస్ పక్ష నేతగా సిరికొండ మధుసూదనా చారిని ఎంపికయ్యారు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. తెలంగాణ తొలి మాజీ స్పీకర్‌గా మధుసూదనాచారి కొనసాగారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నా రు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధుసూదనాచారిని శాసన మండలి బీఆర్ఎస్ పక్ష నేతగా ఎంపిక చేశారు. బీఆర్ఎస్‌లో సిరికొండ బలమైన నేతగా కొనసాగుతున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో తన మార్కును చాటుకుంటున్నారు.

చోరీకి పాల్పడిన ఇద్దరు మైనర్లు

వరంగల్‌చౌరస్తా, జూలై 23: కాశిబుగ్గ వివేకానందకాలనీలో మంగళవారం తెల్లవారుజామున ఇద్దరు మైనర్లు చోరీకి పాల్పడినట్టు ఇంతేజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. అనిల్‌కుమార్ అనే వ్యక్తి తన ఇంట్లోనే కిరాణ షాపు కూడా నడుపతున్నాడని, కుటుంబం షిర్డీకి వెళ్లిన క్రమంలో చోరీ జరిగిందన్నారు. మంగళవారం ఇంటికి తిరిగిరాగా, షాపులోని సామాను చిందరవందరగా ఉండడంలో అనుమానం వచ్చిన అనిల్‌కుమార్ సమాచార ఇచ్చారన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా, రూ.1500 చోరీకి గురికాగా, ఇంట్లో ఎలాంటి బంగారం, ఇతర నగదు చోరీకి గురికాలేదని తెలిపారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన ఇద్దరు బాలురు ఇంట్లో చొరబడి షాపులో దొంగతనానికి పాల్పడినట్టు తెలుస్తోందని సీఐ వెల్లడించారు.



చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

బదిలీపై వెళ్తున్న సూపర్‌వైజర్లకు సన్మానం



సూపర్‌వైజర్లను సన్మానిస్తున్న మార్కెట్ సిబ్బంది

వరంగల్ వ్యవసాయం, జూలై 23: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసి బదిలీపై వెళ్తున్న సూపర్‌వైజర్లు శివ, వెంకన్న, రమణ, వంశీ, ఏఎంఎస్ కన్నయ్య, జేఎంఎస్ శ్రీనివాస్, అటెండర్ ఖైరున్ బీ, వాచ్‌మెన్లు వి.పద్మ, శ్రీనులకు మంగళవారం మార్కెట్‌పర్సన్ ఇన్‌చార్జి మల్లేశం, కార్యదర్శి పోలెపాక నిర్మల సన్మానించారు. సూపర్‌వైజర్ వెంకన్న, శ్రీను వాచ్‌మెన్ శ్రీను వర్ధన్నపేట మార్కెట్‌కు బదిలీ కాగా సూపర్‌వైజర్ వంశీ నెక్కొండ మార్కెట్‌కు బదిలీ అయ్యా రు. మిగితా వారంతా నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌కు బదిలీపై వెళ్తున్నారు. గ్రేడ్ 2కార్యదర్శి రామోజు రాము, అసిస్టెంట్ సెక్రటరీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సీకేఎం ఆస్పత్రిలో రిపోర్ట్ చేసిన ఇద్దరు ప్రొఫెసర్లు



డాక్టర్ బేబిరాణి, అనస్థీషియన్

గిర్మాజిపేట, జూలై 23 : వరంగల్ చందా కాంతయ్య స్మారక (సీకేఎం) ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో మంగళవారం ప్రొఫెసర్లు డాక్టర్ జి.షర్మిల(సూపరింటెండెంట్), డాక్టర్ బేబిరాణిలు రిపోర్ట్ చేశారు. గత వారం జరిగిన వైద్య ఆరోగ్య శాఖ సాధారణ బదిలీలో భాగంగా సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో పనిచేస్తున్న గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి.షర్మిల, అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ బేబిరాణిలు కాకతీయ వైద్యకళాశాల ప్రొఫెసర్లుగా వరంగల్ సీకేఎం ఆస్పత్రికి బదిలీపై వస్తున్నారు. సోమవారం సాయంత్రం బదిలీ ఉత్తర్వులు అందుకున్న షర్మిల, బేబిరాణిలు మంగళవారం ఉదయం ముందుగా కాకతీయ వైద్య కళాశాలకు వెళ్లి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు రిపోర్ట్ చేశారు. అనంతరం సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి చేరుకుని బదిలీ అయిన సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మలాకుమారి, ఆర్ఎంఓ డాక్టర్ యాకుబ్‌పాషా, కార్యాలయంలో సమాచార మిచ్చారు. అనంతరం షర్మిల ప్రసవాల గదికి వెళ్లి పరిశీలించారు. డ్యూటీలో ఉన్న వైద్యులతో సమావేశమై ఆస్పత్రి పరిస్థితిని తెలుసుకున్నారు. బేబిరాణి కూడా ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్లతో పాటుగా ప్రసవాల గదిని పరిశీలించారు. షర్మిల సూపరిం టెండెంట్‌గా రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

రిలీవైన సూపరింటెండెంట్ నిర్మలాకుమారి

నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనాస్పత్రికి బదిలీ అయిన సీకేఎం ఆస్పత్రి సూపరింటుండెంట్, గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ టి.నిర్మలాకుమారి మంగళవారం ఆస్పత్రి విధుల నుంచి రిలీవ్ అయ్యారు. సాయంత్రం నర్సంపేట వైద్య కళాశాల, ఆస్పత్రికి చేరుకుని రిపోర్ట్ చేశారు.

విధుల్లో చేరిన ఇద్దరు ఏఎన్ఎంలు

సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి నుంచి ఇద్దరు ఎఎన్ఎంలు సంధ్యారాణి, పరిమిళ బదిలీ అయ్యారు. వీరి స్థానంలో శారద, మరొకరు మంగళవారం విధుల్లో చేరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కర్ణన్ ఆదేశాల మేరకు సీకేఎం ఆస్పత్రి నర్సింగ్ సిబ్బంది సీనియారిటీ జాబితా తీసుకుని మంగళవారం కార్యాలయ ఉద్యోగి హైదరాబాద్‌కు వెళ్లారు.

ఫర్టిలైజర్ టెస్టింగ్ ల్యాబ్ పరిశీలన



ఫర్టిలైజర్ టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ వ్యవసాయం, జూలై 23: పైడిపల్లి శివారులో నిర్మిస్తున్న ఫర్టిలైజర్ టెస్టింగ్ ల్యాబ్ భవన నిర్మాణ పనులను కలెక్టర్ సత్యశారద మంగళ వారం పరిశీలించారు. అనంత రం కలెక్టర్ మాట్లాడుతూ.. త్వరిత గతిన ల్యాబ్, భవన నిర్మాణ పనులు పూర్తి చేయా లని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారిని ఉషాదయాల్, ఏఈవో క్రిష్ణారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ తీరు మెరుగుపర్చాలి

మేయర్ గుండు సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 23: వరంగల్ నగరంలో పారిశుధ్య నిర్వహణ తీరు మెరుగుపర్చాలని వరంగల్ మేయర్ గుండు సుధారాణి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం బల్దియా కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ.. శానిటేషన్ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేయించాలని సూచించారు. చెత్త తరలింపు వాహనాల మరమ్మతులు వెంటనే చేయాలని ఆదేశించారు. శానిటేషన్ తక్షణ అవసరాల నిమిత్తం ప్రైవేటు ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని చెత్తను వెంట వెంటనే నగరం నుంచి డంపింగ్ యార్డ్‌లకు తరలిం చాన్నారు. డ్రైవరకు ప్రత్యేక వాట్సాప్ గ్రూపు తయారు చేసి సమన్వ యం చేస్తూ చెత్త తరలింపు ప్రక్రియ చేపట్టాలని అన్నారు. సీఎం హెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ సాంబారి సంజయ్‌కుమార్, సూపర్‌వైజర్లున రేందర్ వర్మ, భాస్కర్ పాల్గొన్నారు.

కుడా వెంచర్ల అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

కుడా వైస్‌చైర్మన్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జూలై 23: కుడా వెంచర్ల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం కుడా ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలంలో ఏర్పాటు చేసిన మా సిటీతో పాటు ఉనికిచర్లలో ఏర్పాటు చేసిన యాసిటీ వెంచర్లను వైస్ చైర్మన్ క్షేత్ర స్థాయిలో పరిలించారు. క్షేత్ర స్థాయి పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వెంచర్లలో ప్లాట్స్ పూర్తిచేసిన నేపథ్యంలో అందులో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. ప్రధానంగా మా సిటీయందు అజంజహి కార్మికులు 333 మందికి ప్లాట్స్ కేటాయించినట్లు వెల్లడించారు. ముందుగా ఆ పనులలో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయా లని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో పనులను పరిశీలిస్తున్న అశ్విని తానాజీ వాకడే తదితరులు

గంగదేవిపల్లిని సందర్శించిన అనంతపురం వాసులు



గీసుగొండ, జూలై 23: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా బక్కరాయసముద్రం, నార్పల, పామిడి, గుత్తి, యాకిడి, రాప్తాడు మండలాలలకు చెందిన గ్రామాభివృద్ధి కమిటీల సభ్యులు మంగళవారం సందర్శించారు. రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డీటీ)ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించిన 43మంది బృందానికి జిల్లా ట్రేయినర్ కూసం రాజమౌళి గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, కమిటీల పనితీరు, సాధించిన అవార్డులను వివరించారు. గంగదేవిపల్లి అభివృద్ధిపై డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను చూపించారు. కార్యక్రమంలో బాలవికాస సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సునీత, ఆర్‌డీటీ ప్రతినిధులు శ్రీనివాస్, రామాంజనేయులు, ఆర్పీలు సరోజన, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బల్దియా ఎస్ఈ కృష్ణారావు బదిలీ

వరంగల్ కార్పొరేషన్, జూలై 23: గ్రేటర్ వరంగల్ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈగా పనిచేస్తున్న కృష్ణారావును బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పీవీ కృష్ణారావును హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ డివిజన్ అధికారిగా స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.దానకిశోర్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం వరంగల్ బల్దియాలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వి.రాజయ్యకు కృష్ణారావు స్థానంలో ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టరేట్‌లో పిచ్చిమొక్కల తొలగింపు

వరంగల్ కలెక్టరేట్, జూలై 23: వరంగల్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. పిచ్చి మొక్కల్లో ఉండటం మూలంగా పాములు, విషపురుగులు సంచరించే అవకాశం ఉంది. పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి నిత్యం ప్రజలు అధిక సంఖ్యలో కలెక్టరేట్ వచ్చి పోతు ంటారు. ఇలాంటి సమయంలో పాములు, తేళ్లు లాంటి కీటకాల బారిన పడకుండా అధికారులు మంగళవారం పిచ్చిమొక్కలను తొలగించారు. పిచ్చిమొక్కల మూలంగా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. ఇటీవల ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెత్తాచెదారం కూడా పేరుకపోడంతో ఎక్స్‌కవేటర్‌తో తొలగింపు చర్యలు చేపట్టారు. వర్షపు నీరు నిల్వకుండా గుంతలున్న ప్రాంతాలను చదును చేయించారు. ఏఓ శ్రీకాంత్ మాట్లాడుతూ వర్షకాలం నేపథ్యంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయని, వాటిని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణ పల్లంగా ఉండటంతో భారీ వర్షాలు వచ్చినప్పుడు మెయిన్ రోడ్డుపై నుంచి ప్రవహించే వర్షపునీరు కలెక్టరేట్‌లోకే చేరుతోందన్నారు. వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తున్న దృశ్యం



మండలి బీఆర్ఎస్ పక్ష నేతగా 'సిరికొండ'



భూపాలపల్లిటౌన్, జూలై 23: శాసన మండలిలో బీఆర్ఎస్ పక్ష నేతగా సిరికొండ మధుసూదనాచారిని ఎంపిక య్యారు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. తెలంగాణ తొలి మాజీ స్పీకర్‌గా మధుసూదనాచారి కొనసాగారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధుసూదనాచారిని శాసన మండలి బీఆర్ఎస్ పక్ష నేతగా ఎంపిక చేశారు. బీఆర్ఎస్‌లో సిరికొండ బలమైన నేతగా కొనసాగుతున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో తన మార్కును చాటుకుంటున్నారు. ఆయన ఎంపిక పట్ల పార్టీ నియోజవర్గ ముఖ్యనేతలు చింతల రమేష్, బండారి రవి, గోపు బిక్షపతి, లెంకల రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, రమేష్ హర్షం వ్యక్తం చేశారు.



డీసీ తండాలో బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

గుడుంబా స్థావరాలపై దాడులు

వర్ధన్నపేట, జూలై 23: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగేందర్ రావు ఆదేశానుసారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వర్ధన్నపేట పరిధిలోని డీసీ తండా, నీలగిరి స్వామి తండా, రాయపర్తి మండలంలోని సుభాష్ తండాలలో నాటుసారా కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, 1300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 50 కిలోల బెల్లం స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతడి నుంచి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఐదు కేసులు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వరూప తెలిపారు. అదే విధంగా రాయపర్తి మండలంలోని బాదావత్ లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వరూప, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బి. శిరీషరెడ్డి, సిబ్బంది వెంకటేష్, కుమారస్వామి, రమేష్‌బాబు, బాబు, రాజయ్య, సురేష్, వీరస్వామి, మానస పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

నెక్కొండ, జూలై 23 : మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామానికి చెందిన ముత్తినేని శ్రీనివాస్ (56) ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మహేందర్ మంగళవారం తెలిపారు. హోటల్‌లో మాస్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ ఇటీవల అప్పులు ఎక్కువ కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడికి భార్య పుష్ప, కుమారుడు రాజవంశీ ఉన్నారన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని శవపంచనామా జరిపి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



వేణు

దుగ్గొండి, జూలై23: మండలంలోని మైసంపల్లి గ్రామానికి చెందిన ఎలకంటి వేణు(30) పది రోజులుగా కనబడుటలేదని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు మంగళవారం పేర్కొన్నారు. వేణు తల్లి సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అతడి ఆచూకీ కోసం ఆరాతీస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. అతడి ఆచూకీ తెలసిన వారు దుగ్గొండి ఎస్సై ఫోన్ నంబర్ 8712685232, పీఎస్ నంబర్ 8712685022 లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారికి తగు పారితోషకం ఇవ్వడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

మూఢనమ్మకాలపై పోలీసు కళాజాత

దుగ్గొండి, జూలై23: గ్రామాలలో మూఢనమ్మాకాలను వీడి వాటికి దూరంగా ఉండాలని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని చలపర్తిలో సోమవారం రాత్రి పోలీసు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై పాల్గొని మాట్లాడుతూ యువత గంజాయి, మత్తు పదార్థాలు, డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు నిఘా జాగ్రత్త వహించాలన్నారు. కళాజాతలో పాటల రూపంలో ప్రజలను చైతన్య పరిచారు. ఈకార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జి నాగమణి, విలియం, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కుంగిన చెరువుకట్టకు మరమ్మతులు



చెరువుకట్ట మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

పర్వతగిరి, జూలై 23: మండలంలోని చింతనెక్కొండలో ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుకట్ట కుంగిపోగా మంగళవారం మరమ్మతు పనులను చేపట్టారు. కట్ట కుంగిన ప్రదేశంలో సిమెంటు పైపులను వేసి ఇసుకబస్తాలు, మట్టితో నింపే పనులను ఇరిగేషన్ శాఖ అధికారులు చేపట్టారు. కట్ట మరింతగా కుంగిపోకముందే మరమ్మతు పనులను పూర్తిచేయాలని తహసీల్దార్ వెంకటస్వామి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

కలెక్టర్ సత్య శారద



నల్లబెల్లిలో అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జూలై 23: జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. విద్యాసంస్థల సమీపంలోని కిరాణా షాపుల వేదికగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించే అనుమానాస్పద ప్రాంతాల్లో పటిష్ట నిఘా పెంచాలని పోలీస్ అధికారులకు సూచించారు. మత్తు పదార్థాలు దిగుమతి అయ్యే అవకాశాలు ఉన్నందున రైలు మార్గాలు, రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లలో నిఘా పెంచి అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు గంజాయి సాగుచేయకుండా తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాలు వస్తే అలాంటి రైతులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు.

జిల్లాలో అనుమానిత ప్రాంతాలైన ఉర్సు, శివనగర్, రైల్వే స్టేషన్, బస్టాండ్, ఇతర ప్రాంతాల్లో గంజాయి స్మగ్లింగ్, గంజాయి వ్యసనానికి అలవాటు పడుతున్న యువత స్థితిగతులను పసిగట్టినట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 8712661111కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్, వ్యవసాయ అధికారి ఉషాదయాల్, నర్సంపేట, వర్ధన్నపేట ఏసీపీలు కిరణ్ కుమార్, నర్సయ్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీఈవో వాసంతి, అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి మురళి, డీఎఫ్ఓ సదానందం, డ్రగ్ కంట్రోల్ కానిస్టేబుల్ నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

నల్లబెల్లి: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని కలెక్టర్ సత్యశారద అన్నారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల హాజరు పట్టికను తనిఖీ పరిశీలించారు. బీసీ హాస్టల్‌ను సందర్శించి వార్డెన్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రం, బీసీ హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. బీసీ హాస్టల్, అంగన్‌వాడీ భవనాలను పరిశీలించి భవనాల మరమ్మతుకు నివేదిక తయారు చేయాలని అందుకు నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బోనగాని రాజేష్, ఎంపీడీవో నరసింహమూర్తి, ఎస్సై ప్రశాంత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఏఈవో మౌనిక

వర్ధన్నపేట, జూలై 23: పత్తి చేనులో సకాలంలో సస్య రక్షణ చర్యలు చేపట్టి తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించాలని వర్ధన్నపేట ఏఈవో మౌనిక అన్నారు. మంగళవారం వర్ధన్నపేట పట్టణంలోని రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌కు రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ పత్తిలో సుమారు పది రకాల పురుగులు పంటలను ఆశించి నష్టపరుస్తున్నాయని తెలిపారు. వీటిలో ముఖ్యంగా పచ్చదోమ, పేనుబంక, తామర పురుగులు, తెల్లదోమ, పిండినల్లి పత్తి ఆకుల నుంచి రసాన్ని పీలుస్తున్నాయని అన్నారు. శనగపచ్చ పురుగులు పత్తి మొగ్గలను, కాయలను తినడం ద్వారా గులాబీ రంగు పురుగులు కాయలను ఆశించడం ద్వారా అధిక నష్టం కలుగజేస్తున్నాయని చెప్పారు.

చీడపీడలను అదుపుచేయడానికి క్రిమిసంహారక మందులను విచక్షణా రహితంగా ఉపయోగించడం వలన పత్తి పంట సస్య రక్షణలో పలు సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వీటిని అధిగమించడానికి పర్యావరణానికి మేలైన సమగ్ర సస్యరక్షణ చర్యలను పాటిస్తే చీడ పీడలను సమర్థవంతంగా అదుపు చేయడంతో పాటు పురుగు మందుల వల్ల వచ్చే సమస్యలను అధిగమించవచ్చని ఆమె తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి



కొండాపూర్‌లో పాఠశాలలోని సిబ్బందితో మాట్లాడుతున్న సంధ్యారాణి

రాయపర్తి, జూలై 23 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. మంగళవారం మండలంలోని కొండాపూర్, తిర్మలాయపెల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల చదువు కోసం రూ. కోట్ల రూపాయాలు ఖర్చు చేస్తోందని, విద్యార్థులు ఉపాధ్యాయుల పాఠాలను అందిపుచ్చుకుని మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన సదుపాయం లాంటివి ఉచితంగా అందిస్తూ విద్యార్థులకు అండగా ఉంటోందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు నిష్ణాతులై ఉంటారని, వారి బోధనలు విని మంచిమార్గంలో నడవాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి కావాలని ఆదేశించారు. పాఠశాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

23.8 అడుగులకు పాకాల నీటిమట్టం



పాకాల నీటిమట్టం

ఖానాపురం, జూలై 23: జిల్లాలోనే సాగునీటి వనరుల్లో పెద్దదైన పాకాల సరస్సు నీటి మట్టం మంగళవారం నాటికి 23.8 అడుగులకు చేరుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. 30 అడుగుల పూర్తి సామర్థ్యం గల పాకాల సరస్సులోకి 23.8 అడుగుల నీరు చేరుకోవడంతో సరస్సు జలకళను సంతరించుకుంది. పాకాల ఆయకట్టులో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండటంతో రైతులు వ్యవసాయ కూలీల కొరతతో కొంతమేర ఇబ్బందులు పడుతున్నారు.

లీడ్ లైబ్రరీలో ఘనంగా దాశరథి శత జయంతి

నర్సంపేట టౌన్, జూలై 23: నర్సంపేట పట్టణంలోని లీడ్ లైబ్రరీలో దాశరథి శత జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ నా తెలంగాణ కోటి రతనాల వీణ అని ప్రకటించి తెలంగాణ ఉద్యమానికి ప్రేరణ నిచ్చిన గొప్ప కవి దాశరథి అన్నారు. లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు, కవి కాసుల రవికుమార్ మాట్లాడుతూ నిజాం ప్రభువును ఎదురిస్తూ ఎన్నో గొప్ప రచనలు చేయడంతో పాటు తెలంగాణ విముక్తికై కృషి చేసిన మహనీయుడు దాశరథి అని అన్నారు. అభ్యుదయ కవి సామ్రాట్, కవి సింహంగా తెలుగు సాహిత్య చరిత్రలో చెరగని ముద్రవేసిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘుపతి, రమేష్, రాజు, వీరన్న పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో వెంకటరమణ



దుగ్గొండి పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న వెంకటరమణ

దుగ్గొండి, జూలై23: ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు గర్భిణులు అధిక సంఖ్యలో ఆస్పత్రికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ వైద్యాధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం, కేశవాపురం పీహెచ్‌సీ, తొగర్రాయి, వెంకటాపురం ఉపకేంద్రాలు, చాపలబండ వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పీహెచ్‌సీలలోని అన్ని రికార్డులు, తనిఖీ చేసి ఓపీల సంఖ్య పెంచాలన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు తగు సూచనలు చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా ప్రజలను చైతన్య పరచాలన్నారు. గ్రామాలలో వైద్య సిబ్బంది సందర్శించి నీటి నిల్వలు లేకుండా గ్రామ సిబ్బందికి తెలపాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్ కుమార్, హెచ్ఈవో సాంబయ్య, సలోమి, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పింఛను హామీని నెరవేర్చాలి

వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్

వర్ధన్నపేట రూరల్, జూలై 23: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలోని ఆరు గ్యారెంటీల్లో పెన్షన్(చేయూత) పథకంలో వృద్ధులకు, వితంతువులకు, గీత, బీడీ కార్మికులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేల పెన్షన్లను అధికారంలోకి రాగానే పెంచి ఇస్తామని వాటిని ఎందుకు అమలు చేయడం లేదని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని ఇల్లందలో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేస్తూ వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ షరీఫ్, రాష్ట్ర మహిళా నాయకురాలు గుడపల్లి సుమతి, మండల అధ్యక్షుడు జట్టబోయిన శ్రీనివాస్, రాయపర్తి మండల అధ్యక్షుడు ఇస్లావత్ బాలకృష్ణ, నల్గొండ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక మత్స్యగిరి, నాయకులు షారుణ్, వెంకన్న, ముత్తయ్య, రమేష్, గోకుల శేఖర్‌రెడ్డి, మంచాల వెంకన్న, లింగారెడ్డి, హరీఫ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల నివారణ



రెడ్లవాడలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రకాశ్

నెక్కొండ, జూలై 23 : వ్యక్తిగత పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని డిప్యూటీడీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ప్రకాశ్ అన్నారు. మండలంలోని రెడ్లవాడలో మంగళవారం నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వర్షాకాలం ఆరంభంలో వీధుల్లో నీరు నిలువడంతో వాటిలో దోమలు చేరి స్వైరవిహారం చేస్తుండటమే కాకుండా వాటితో వ్యాధులు ప్రబలుతాయన్నారు. వీధులో చెత్తలేకుండా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాయంత్రం సమయంలో ప్రతీ ఇంటి అవరణలో ఎండివేపాకుతో పొగ వేయడం వల్ల దోమలను నివారించడం సాధ్యమౌతుందన్నారు. జ్వరంతో బాధపడుతున్న రోగుల నుంచి రక్తం, మూత్ర నమూనాలను సేకరించారు. వేడి చేసి చల్లార్చిన నీటిని, వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. టీజీఆర్ఎస్ హాస్టల్లో వైద్యుల బృందం సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుమన్, వైద్యులు మౌనిక, యాకస్వామి, స్వప్న, నాగలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

నర్సంపేట టౌన్, జూలై 23 : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి కొమ్ముక రవి డిమాండ్ చేశారు. నర్సంపేటలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచిపోతున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమన్నారు. విద్యాశాఖ మంత్రి లేకపోవడంతో విద్యారంగ సమస్యలు పేరుకుపోయాయని, సీఎం పర్యవేక్షణలో ఉండడం వల్ల విద్యాశాఖలోని సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, లేని ఎడల ఆందోళనలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో గణేష్, రవితేజ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండలో రాజకీయ శిక్షణ శిబిరాలు

నెక్కొండ, జూలై 23 : నిరుపేద ప్రజలకు విద్యా, వైద్యం, కూడు, గూడు, ఉపాధి వంటి కనీస మౌలిక సదుపాయల కల్పనలో నాటి నుంచి నేటి వరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమౌతున్నాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేశ్ ఆరోపించారు. ఈ నెల 26, 27 తేదీల్లో నెక్కొండలో రాజకీయ శిక్షణ శిబిరాల నిర్వహణకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దాదాపు 40 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన దుర్భర జీవితం గడుపుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నెక్కొండ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, గోవర్ధనచారి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి

చెన్నారావుపేట, జూలై 23: వర్షా కాలంలో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ సరోజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు ధర్మతండాలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉండాలన్నారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాలల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌రాజు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ రమాదేవి, రామెల్, పుష్పలత, క్రాంతి, సరిత, సురేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

చెన్నారావుపేట, జూలై 23: మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జయ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించటం అభినందనీయమన్నారు. గతంలోను విద్యార్థులకు పాలిటెక్నిక్ పుస్తకాలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పులి దేవేందర్, పిన్నింటి బాలాజీరావు, సంతోష్‌కుమార్, ఉదయ్‌కుమార్, మొగిలి, సీహెచ్ మాధవి, సుందర్, సతీష్ స్వప్న, జావెద్, చింతికింది ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

నెక్కొండ, జూలై 23: రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు ప్లేవే పద్ధతిలో బోధించడానికి అంగన్వాడీలకు అనుమతి ఇవ్వాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసహరించుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బానోతు జాన్‌నాయక్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అమలుచేస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్య నిర్వీర్యమయ్యే పరిస్థితులు నెలకొంటాయన్నారు. అలాగే ప్రాథమిక విద్య పూర్తిగా ప్రైవేట్‌పరం అవుతుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంపై పునరాలోచన చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ నాయకులు కుమారస్వామి, బాలాజీ, కృష్ణమూర్తి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి ఎంపీవోగా ప్రకాష్



రాయపర్తి, జూలై 23: మండల పంచాయతీ అధికారిగా మంగళవారం కూచన ప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. మండల ఎంపీవోగా పనిచేసిన రాంమోహన్ నర్సంపేటకు బదిలీ కాగా, నల్లబెల్లి మండలంలో పని చేస్తున్న ప్రకాష్ రాయపర్తి మండలానికి వచ్చారు.

నల్లబెల్లి ఎంపీడీవోగా రవి



నల్లబెల్లి, జూలై 23: నల్లబెల్లి ఎంపీడీవోగా పసరగొండ రవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో కూచన ప్రకాష్ బదిలీపై రాయపర్తికి వెళ్లారు. కాగా బాధ్యతలు చేపట్టిన రవికి ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా సత్యం



చెన్నారావుపేట, జూలై 23: చెన్నారావుపేట, ఆటో యూనియన్ అధ్యక్షుడిగా బండారి సత్యంగౌడ్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కంది కృష్ణారెడ్డి, సిద్దె ఉపేందర్‌లు, ఉపాధ్యక్షుడిగా సాదు రాజు, ప్రధాన కార్యదర్శిగా కొట్టం మోహన్, క్యాషియర్‌గా ఉప్పుల రాజు, జాయింట్ సెక్రటరీగా అంద్ర చిన్నయ్య, కార్యవర్గ సభ్యులుగా సుంకరి చిరంజీవి, సింగారాపు ప్రవీణ్, కందికొండ రాజు, కరెడ్ల శివ, జంగిలి ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు.

నారాయణతండాలో వైద్య శిబిరం

దుగ్గొండి, జూలై 23: మండలంలోని నారాయణతండాలో మంగళవారం తిమ్మంపేట పల్లెదావాఖాన ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. ఈశిబిరంలో డాక్టర్ పృథ్వీరాజ్, హెల్త్‌అసిస్టెంట్ చానిక్య, ఏఎన్ఎం బుజ్జమ్మ ఆశకార్యకర్త సంధ్యలు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్‌కు బెడ్ అందజేత

పర్వతగిరి, జూలై 23: మండలంలోని చింతనెక్కొండలో గల హెల్త్ సబ్‌సెంటర్‌కు గ్రామీణ హితకారిణి సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గటికె మల్లయ్య మంగళవారం బెడ్‌ను అందించారు. హెల్త్ సబ్‌సెంటర్‌లో బెడ్‌లు లేక పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల గ్రామసభలో పలువురు గ్రామస్థులు తెలిపారు. దీనికి స్పందించిన మల్లయ్య సబ్‌సెంటర్‌కు బెడ్‌ను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నవ్యకృష్ణ, ఏఎన్ఎం రజిత, పంచాయతీ కార్యదర్శి సరిత, ఆశ వర్కర్స్ పద్మ, సునిత, ధనలక్ష్మి, రమాదేవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

'రైతులతో చెలగాటమాడుతున్న బ్యాంకర్లు'

పర్వతగిరి, జూలై 23: రైతు రుణమాఫీ సందర్భంగా రైతుల రుణాల వివరాలను ప్రభుత్వానికి అందించకుండా బ్యాంకర్లు రైతులతో చెలగాటమాడుతున్నారని బంజారా సేవాలాల్ సంఘం మండల అధ్యక్షుడు మూడు అంజీనాయక్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని మూడెత్తులతండాకు చెందిన పలువురు రైతులు పంతిని గ్రామంలోని ఇండియన్‌బ్యాంకులో తీసుకున్న పంటరుణాలకు సంబంధించి బ్యాంకర్లు ఉన్నతాధికారులకు వివరాలు అందించలేదని ఆరోపించారు. దీంతో ఆయా రైతులకు రుణమాఫీ కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకర్ల నిర్లక్ష్యంపై కలెక్టరేట్ గ్రీవెన్స్‌సెల్‌లో సైతం ఫిర్యాదుచేసినట్లు ఆయన తెలిపారు. వెంటనే రైతుల డాటాను ప్రభుత్వానికి పంపించి వారికి రుణమాఫీ వర్తించేలా చూడాలని ఆయన డిమాండ్‌చేశారు.